


# దూరం

శ్రీధర

విష్ణుమూర్తి గారు చాలా బిజీగా ఉన్నారు.

ఆ మాటకొస్తే ఆయన ఆఫీసులో ఉన్నంతసేపూ అష్టావధానం చేస్తూనే ఉంటారు. ఈ అవధానం అలవాటయిపోయి, ఎంత పని ఉన్నా చిరునవ్వుతో అందరికీ సమాధానాలు చెప్పుతుంటూ, అయినవారి దగ్గర నుంచేగాక కానివారి దగ్గరనుంచీ, చివరకు కొరగాని వారిదగ్గరనుంచీ కూడా మెప్పును పొందుతూ వస్తున్నారు విష్ణుమూర్తిగారు.

చల్లని నీడ నిచ్చే చెట్టు క్రిందకు నలుగురు చేరటంలో వింతేముంది? సాయం చేసే మనిషి అందకోసం, పదిమంది పలు మూలలనుంచి పనిగట్టుకు రావటంలో మాత్రం అబ్బురం ఏముంది గనుక? అంచేత పొద్దున్న పదిన్నరకు వచ్చి కుర్చీలో నడుం వంచి కూర్చున్నప్పటి నుంచీ, రాత్రి ఏడుగంటలకో ఎనిమిది గంటలకో లేచి లైటు ఆర్పేదాకా ఆయన్ని దర్శించుకోవడానికి వచ్చేవారి సంఖ్య, ఆయన పదవితోపాటే పెరుగుతూ వచ్చింది.

అధికారం అనుమతించినంతవరకూ ఎవరికే సాయం చెయ్యటానికైనా ఆయన వెనకాడే మనిషికాడు. ముక్కూ మొహం తెలియని వాడయినా వచ్చి, "అయ్యా మీవల్ల ఈ పని కావాలి" అని వేడుకుంటే, వీలుంటే చేస్తూనే ఉంటారు. ఎటొచ్చీ, ఇబ్బందల్లా, ఎక్కడంటే, ఆయన మంచితనాన్నీ, స్నేహాన్నీ అలుసుగా తీసుకుని, న్యాయంగా చెయ్యగూడని పనులుకూడా ఆయన చేత చేయించుకోవాలని ఆప్తులు, మిత్రులు అయిన వాళ్ళు ప్రయత్నిస్తూ, పరీక్షిస్తూ ఉంటారు. ఇలాంటప్పుడే ఆయన కొంచెం వెనక ముందులాడుతుంటారు.

ప్రాణమిత్రుడనుకున్న ప్రసాదరావు దగ్గరనుంచే ఆయనకు ఈ అగ్ని పరీక్ష ఎదురు కావటం మరీ వింతగా ఉంది. ప్రసాదరావు పంపిన మనిషి ఈ రామస్వామి తన గదిలో, తన ఎదురుగా ఉండగానే రావటంతో ఆయన పని అడకత్తెరలోని పోకచెక్కలా అయిపోయింది. ఎందుకొచ్చాడో తెలియక,

వచ్చిన పనేమిటో చెప్పమన్నాడు. అది తప్పయిపోయింది.

''మరండీ, ప్రసాదరావుగారు మాకు అన్నగారవుతారండి. అంటే ఆయన బిడ పిల్లాకు మా వోన్ సిస్టర్నిచ్చామండి. మాకూ ఆయనకూ చాలా దగ్గర చుట్టరికమండీ. అదీ కాక ఆయన వైఫ్‌కి, మా మిసెస్ అంటే..''

''సర్లెండి, విషయమేమిటో చెప్పండి'' అన్నారు విష్ణుమూర్తిగారు శ్రద్ధగా వినటం కోసం, కొంచెం ముందుకు వంగి.

ఆ చెప్పవల్సిన అతను, అక్కడున్న మూడో మనిషిని చూసి అదోలా నవ్వి నసిగాడు. అది గమనించిన విష్ణుమూర్తిగారు ''ఫరవాలేదు. చెప్పండి'' అని అతనికి అభయమిచ్చారు.

ఆ మూడో వ్యక్తి పంచె, లాల్చీ వేసు కున్న వయసు మళ్ళినవాడు కావటంచేత ఆయన ఆఫీసు సిబ్బందికి సంబంధించిన వాడు కాడని, విష్ణుమూర్తిగారి తాలూకు బంధువర్గంలోని వాడని అతనికి అనిపించింది. దానితో ధైర్యం తెచ్చుకుని నెమ్మదిగా అన్నాడు...

''నా పేరు భానోజీరావు అండీ. నేను బెజ వాడ డివిజన్‌లో పనిచేస్తున్నానండీ. తమరు లాస్టియరు బందరు వెడుతూ బెజవాడలో కాంప్ వేసినప్పుడు, మా ఆఫీసరు గారితో నేనూ గెస్ట్‌హౌస్‌కి వచ్చి తమ దర్శనం చేసుకున్నానండి. రిటర్న్ జర్నీలో హైదరా బాదు వచ్చేందుకు తమకు టిక్కెట్టు తెచ్చి ఇచ్చానండి...''

''సరే. ఇప్పుడు వచ్చిన పనేమిటో చెప్పండి...'' అన్నారు విష్ణుమూర్తి గారు ఓర్పు వహించి. ''మరేనండీ... మరండీ, నేను గుంటూరులో పనిచేస్తున్న గోపాలరావు గారూ ఒకేరోజు ఒకే పూట సర్వీసులో చేరా మండీ అప్పట్నించీ మా ఇద్దరిలో ఎవరు సీనియరూ అన్నది తేలలేదండీ. మా ఇద్దరి పేర్లూ బ్రాకెట్ చేస్తూ వచ్చారండి. ఇప్పుడు ప్రమోషన్ మా ఇద్దరిలో ఎవరికివ్వాలో తేలక, ఇక్కడికి రిఫర్ చేశారండి. ఆ ఫైలు నిన్న సెక్షన్ నుంచి తమకు వచ్చిందండి. క్రిందవాళ్ళేమో మెరిట్ కం సీనియార్టీ చూడాలంటున్నారండి...''

''అవును మరి, అంతేగదా'' అన్నారు విష్ణుమూర్తిగారు చిన్నగా నిట్టూర్చి.

అతను అదోలా నవ్వాడు. ''మెరిట్ కం సీనియారిటీని తెలుగులో ఆఫీసర్ల ప్రాపకం అంటారండీ'' అన్నాడు.

''మిస్టర్ భానోజీరావ్. ఇటీజ్ టూ మచ్. ఆఫీసర్లతో ఎలా మాట్లాడాలో నేర్చుకోవాలి నువ్వు. మా గురించి, మా ముందే నువ్విలా మాట్లాడితే, ఇంక మా వెనకాల ఎలాంటి విమర్శలు చేస్తావో నేను ఊహించుకోగలను' అన్నారు విష్ణుమూర్తి కోపం తెచ్చుకుని.

''అయామ్ సారీ సర్, నేను అన్నది గోపాలరావు గురించి అండి, అతనికి పొద్దున లేచినప్పటి నుంచీ ఆఫీసర్ల భార్యలకు సేవలు చెయ్యటం తప్ప, ఆఫీసు పని ఏమిటో తెలియదండీ...'' అని మళ్ళీ పళ్ళు వెళ్ళ బెట్టాడు భానోజీరావు.

''మళ్ళీ మా ఆఫీసర్లనే అవమానిస్తు న్నావు. నీలాంటి వాడికా ప్రమోషన్ ఇవ్వ టం!... సరే, ఇంక నువ్వు వెళ్ళవచ్చు...'' అని ఇక అతని మొహంలోకి కూడా చూడ టం ఇష్టంలేనట్లు తల తిప్పుకుని తన పనిలో మునిగిపోయారు విష్ణుమూర్తి గారు.

అనాలోచితంగా చేసిన చిన్న పొర పాటుకు పదిమాట్లు క్షమాపణలు చెప్పుకుని

విష్ణుమూర్తిగారిచేత మరో రెండుసార్లు కసిరించుకుని బయట పడ్డాడు భానోజీరావు.

ఆ కోపమంతా వచ్చి ప్రసాదరావు గారి ఇంట్లో చూపించాడు భానోజీరావు. ప్రసాద రావు గారూ విస్తుపోయారు. తన పేరు చెప్పాక కూడా కసురుకోవటంలో అర్థ మేమిటో బోధపడలేదాయనకు. నమ్మ లేనట్లుగా చూసి, ఇంకా అనుమానంగానే అడి గాడు ప్రసాదరావుగారు.

''నువ్వు నా పేరు చెప్పినప్పుడు, సరిగ్గా విన్నాడా విష్ణుమూర్తి ?...''

''బ్రహ్మాండంగా విన్నాడు. ముందుకు వంగి మరీ విన్నాడు. మీరంత నమ్మకంగా చెప్పబట్టి నేను వెళ్ళి ఆ మాత్రమైనా అడి గాను. లేకపోతే అసలు వెళ్ళేవాడినే కాను. అనవసరంగా అడిగి లేదనిపించుకున్నాను. బహుశా నా అనుమానం ఏమిటో చెప్పనా? ఆ గుంటూరు గోపాలరావుగాడు ఈ గురుణ్ణి ఈ పాటికి కొనేసి ఉంటాడు. అదొక మెరిట్ అండీ, బాబూ, అందరికీ చేతగాదు'' అని ముగించాడు భానోజీరావు.

భానోజీరావు అంతటితో ఆగక ప్రసాద రావు గారి ప్రతాపం గురించి, నలుగురు బంధువుల ముందరా చెప్పగా, విన్నవారంతా ప్రసాదరావుగారి వంక చూసి హేళనగా నవ్వగా, ఆయనలోని పౌరుషం బుస్సుమని పొంగింది.

విష్ణుమూర్తి మీద దెబ్బకొట్టే అవకాశం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. ఆ అవ కాశం కూడా రానేవచ్చింది. ఈ ఊరికి ఆ ఊరు ఎంత దూరమో, ఆ ఊరికి ఈ ఊరూ అంతే దూరం అని రుజువు చెయ్యాలి.

ప్రసాదరావు గారు ఆ రోజు తన ఆఫీ సులో జరిగే ఇంటర్వ్యూలు ముగించి, భోజ నం పూర్తిచేసి, మళ్ళీ తన సీటులోకి వచ్చి కూర్చున్నాక, ఎవరో ఒక అమ్మాయి తనను చూడగోరుతున్నదని ప్యూను ఒక చీటీ తెచ్చి ఇచ్చాడు.

'మిస్ పావని, డాటరాఫ్ శ్రీ విష్ణుమూర్తి గారు, యం.డి... అని చదువుకున్నాడు.

ప్రసాదరావుగారి కా క్షణంలో ఆనందం మీద ఆవేశం విస్కీగ్లాసులోని సోడా పొంగులా బుస బుస లాడింది. ఆ పిల్ల వచ్చి ఎదురుగా నిలబడింది. టేబులుకు అవతల పక్కనున్న కుర్చీలో కూర్చుని, అంతలోనే తన తప్పు తెలుసుకుని లేచి నిల బడింది. గొంతు సవరించుకుని, కోపంగా చూస్తున్న ప్రసాదరావుగారి కళ్ళల్లోకి చూడ లేక, తల దించుకుని గుటకలు మింగుతూ జేబురుమాలుతో నుదుటి మీది చెమటను తుడుచు కుంటూ చెప్పింది :

''సర్, నేను విష్ణుమూర్తిగారి అమ్మాయి నండి. ఎమ్మెస్సీఫస్టుక్లాసులో ప్యాసయ్యాను. ఇందాక మీ ఆఫీసులో ఇంటర్వ్యూ జరిగింది. మా నాన్నగారు మీకు తెల్సునని చెప్పారు. అందుకనే మీకు...తమరికి చెబుదామని... బాగానే చేశానండి. కానీ ఎవరికో రికమం డేషన్ ఉందని అంటేను... మా నాన్నగారు అవసరమైతే మిమ్మల్ని కల్సుకోమన్నారు.''

ఆ పిల్ల చిరుచెమటలు తుడుచుకుంటుందో పెల్లుబుకుతున్న కన్నీటిని తుడుచుకుం టుందో తెలియటంలేదుగాని, వొణుకుతున్న గొంతు, అదురుతున్న అధరాలూ, కంపి స్తున్న కరచరణాలూ, ఆ పిల్ల ఎంత చలించిపోతుందో తెలియజెబుతున్నాయి.

ప్రసాదరావుగారికి విష్ణుమూర్తి చాలా మంచి మిత్రుడు. విష్ణుమూర్తి కూతురని తెలిస్తే, మరొకప్పుడైతే ఈ పిల్లను తన

కన్న కూతురిలా ఊరడించి, ధైర్యంచెప్పి చేతికి అపాయింట్‌మెంట్ ఆర్డరిచ్చి, ఆ పైన కాఫీ ఇప్పించి, కాసేపు చిరునవ్వులు ఆపిల్ల పెదవులమీద పూయించి, ఇంటికి పంపే వాడు. ఇంత ఆదరం జరుగుతుందనే ధైర్యం తోనే పావని ఆయన గదిలోకి అడుగు పెట్టింది. కానీ ఆయన తీక్షణ వీక్షణాలు చూసి, పెనుగాలికి చెలించిపోయిన చిగురు టాకులా అయిపోయింది. కనీసం కూచో మని అయినా ఆయన అనకపోవటంతో ఆమెకు తలకొట్టేసినట్లుగా ఉంది. గదిలో నుంచి బయటకు పారిపోయి, ఇంటికి పరు గెత్తుకుని పోయి, నాన్నగారి ఒళ్ళో వాలి పోయి, ఎప్పుడు పెద్దగా ఏడ్చేద్దామా అని ఉందా అమ్మాయికి.

ప్రసాదరావుగారికి మాత్రం నెల రోజుల నాడు, భానోజీరావు చెప్పిన మాటలే చెవులో మార్మోగుతున్నాయి. కసిగా పెద్దగా అరిచాడు.

"నేను ఎవరి మొహమాటాలకి లొంగి పొయ్యే వాణ్ని కానని మీనాన్నకి చెప్పు. నాకూ మెరిట్, మెరిట్ కావాలి. అండర్ స్టాండ్?"

ఆ పిల్లకు ఏమీ అర్థంకాలేదు. ఆయన కోపంగా అరిచాడని తప్ప బిక్కచచ్చి పోయి, నోటమాట రాక, రెండు చేతులూ ఎత్తి అలా ఒకటికి రెండుసార్లు నమస్కా రం పెడుతూనే, వెనక వెనక్కి నడుస్తూ బయటకు వెళ్ళిపోయింది పావని.

ఒక వారం రోజుల తర్వాత ఒక రిసె ప్షన్‌లో మిత్రులిద్దరూ తారసపడ్డారు. లోలోపల ఎంత క్రోధంగా ఉన్నా, సభ్యతా సంస్కారం సూచించే సూట్లూ, బూట్లూ కప్పుకుని తిరిగే పెద్ద మనుష్యులు గనుక,

## కుక్కల కుటుంబ నియంత్రణం

*మన దేశానికంటే ముందే అమెరి కాలో కుక్కల కుటుంబ నియంత్రణ ప్రారంభమయింది. వాషింగ్టన్ మహా నగరంలోని జీవ కారుణ్యా సంస్థలు అక్కడి అన్ని ఇండ్లకూ ఈ విధంగా ఒక విజ్ఞప్తి పత్రాన్ని పంపించాయి - "ఇళ్లూ, నా అనేవాళ్లూ లేకుండా ఈ వాషింగ్టన్ మహానగరంలో వేలాది కుక్కలు రోడ్లమీద, వీధులలో అల్లరి చిల్లరిగా తిరుగుతున్నాయి. దయచేసి, మీ కుక్క సంతానాన్ని పెరగనివ్వా కండి; పెరగనిస్తే ఈ వేలాది కుక్కల సంఖ్యా మరింత ఎక్కువవుతుంది. ఒక కుక్క పుడితే, అంతకు ముందున్న మరొక కుక్కకు ఇల్లు లేకుండా అవు తుందని, అది రోడ్డు మీద పడవలసి వస్తుందని గమనించండి..."*

ఏమీ ఎరగని వాళ్ళలాగానే చేతులు కలుపు కున్నారు. చతురోక్తులను సరసంగా విసురు కున్నారు. చిరునవ్వుల్ని అందరి మధ్య వడ బోసుకున్నారు. ఒకరికొకావల్సినవి మరొకరు చెంచాలతో వడ్డించుకున్నారు. అరగంటసేపు లోకాభిరామాయణాన్ని తవ్వి పోసు కున్నారు.

అంతా అయ్యాక విష్ణుమూర్తిగారు ప్రసాదరావుగారి చేయిపట్టుకుని, కొంచెం ఎడంగా లాక్కుపోయి, చెట్టుక్రింద నిలబెట్టి చెప్పారు.

"మీ బెజవాడ భానోజీరావును ఆ రోజు

### "అంద విహీనులు లేరు"

*జానకిరాం స్త్రీలను ఎప్పుడూ పొగడుతూ వుంటాడు. ఒకరోజు ఓ సమావేశంలో "ఈ సృష్టిలో అంద విహీనంగా వుండే స్త్రీ లేనేలేదు" అన్నాడాయన ఒక చప్పిముక్కావిడ వెంటనే "నన్ను చూడండి" అని అతనికి ఓ సవాల్ విసిరింది. "అమ్మా నీవు కూడా స్వర్గం నుంచే, వస్తున్నప్పుడు లేండింగ్‌లో కాస్త గొడవైనట్లుగా వుంది" అన్నాడు నవ్వుతూ.*

అలా నొప్పించ వల్సి వచ్చినందుకు మరేం అనుకోకు. అతను నాదగ్గరకు వచ్చినప్పుడు అతని ప్రత్యర్థి అయిన గుంటూరు గోపాలరావు తండ్రి నా ఎదురుగానే ఉన్నాడు, ఆయనా ఈ పనిమీదే వచ్చి ఉన్నాడు. అదీ గాక, ఆయనకు కొంత మొహమాటంతోనూ ఉండి పోయాను. అందుచేత అలా నొప్పించ వల్సి వచ్చిందా..." అని సంజాయిషీ చెప్పుకున్నాడు. విష్ణుమూర్తిగారు.

"అలాగా, ఆ విషయం నాకు తెలియదు గదా..."

"రెండు రోజుల దాకా ఆయన నన్ను వదల్లేదు...మా ఇంట్లోనే తిష్ట వేశాడాయె".

"అంటే గుంటూరు గోపాలరావు మీ బంధువా ఏమిటి?"

"ఆ బంధుత్వం మన స్నేహబంధానికన్నా విలువైనది కాదు. కానీ, ప్రసాద్ రావు-చిన్న డెలికసీ ఏమిటంటే ఈ గోపాలరావు తండ్రి, మా పావనికి ఒక సంబంధం తెచ్చాడు. అటూ, ఇటూ అందరికీ అన్నీ నచ్చాయి..." అని ఆగిపోయారు విష్ణుమూర్తిగారు.

ప్రసాదరావుగారు అర్థం చేసుకున్నారు. "సారీ, మీకు నేను చాలా శ్రమ ఇచ్చాను. ఈ విషయాలన్నీ నాకు తెలియవుగదా. మీరైనా ఫోన్ చేయవల్సింది...."

"మీరు చేస్తారుగదా అని నేను చాలా రోజులు ఎదురు చూశాను. మీ భానోజీరావుకి మర్నాడే ప్రమోషన్ అర్డర్ టెలిగ్రాం ద్వారా పంపించాను. అది తెల్సాక మీరే నన్ను అర్థంచేసు కుంటారని, ఫోను చేస్తారని ఎదురు చూశాను...."

ప్రసాదరావుగారు ఖిన్నుడైనాడు"

"అయామ్‌సారీ, భానోజీరావుకి ప్రమోషన్ ఇచ్చినట్లు, ఇప్పుడు మీరు చెప్పే వరకూ తెలియదు. తెలిస్తే తప్పకుండా..."

"ఇట్సాల్‌రైట్. బంధువుల గురించి నాకు బాగా తెల్సు. రండి వెళదాం..." అని స్నేహితుడి భుజాన చెయ్యివేసి నడిపించుకుంటూ వచ్చారు విష్ణుమూర్తిగారు.

నాలుగు అడుగులు వేశాక, ఏదో గుర్తుకొచ్చినట్లు అయి, ప్రసాదరావుగాదు నవ్వు బలవంతాన తెచ్చుకుని అడిగాడు.

"మరి అమ్మాయి పెళ్ళి ఎప్పుడు ?"

"కుదిరిందనుకున్న సంబంధం తప్పిపోయింది...ఇంతకీ పెళ్ళిళ్ళు ఇక్కడ జరుగుతాయేగాని, వాటి తాలూకు నిర్ణయాలు స్వర్గంలో అవుతాయట..." అని కళాకాంతి లేని నవ్వు ఒకటి నవ్వబోయి, చేతగాక, ఊరుకోనూలేక, కళ్ళు మసకబారి నందుకు కళ్ళజోడు తీసి తుడుచుకున్నాడు, విష్ణుమూర్తిగారు.

ప్రసాదరావుగారు నోట మాట రాక నిశ్చేష్టుడైపోయాడు. *